

# హాస్య వల్లరి





## నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్

ఆరేళ్ళ రాము తన ఇంటి వెనక మూడడుగుల గోతిని తీస్తూండడం గమనించి పక్కింటాయన అడిగాడు.

"దేనికది?"

"నా పెంపుడు గోల్డ్ ఫిష్ చచ్చి పోయింది. దాన్ని పూడ్చి పెట్టడానికి.."

"కానీ ఇంత పెద్దగొయ్యి ఎందుకు? చేపపిల్లకి చిన్నగొయ్యి సరిపోతుంది కదా!?"

"కానీ నా గోల్డ్ ఫిష్‌ని తిన్న మీ పిల్లి పెద్దది కదా!" జవాబిచ్చాడు రాము.

చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

పాఠం చెప్పకుండా ఎగగొట్టటంలో నేర్పరైన ఓ టీచర్ ఒక క్లాసుకు వచ్చి కూర్చున్న తరువాత, "అబ్బాయిలూ నేనీరోజు ఏ విషయం గురించి పాఠం చెప్తానో తెలుసా?" అన్నాడు.

"తెలియదు మాష్టరుగారూ!" అన్నారు విద్యార్థులంతా.

"ఏమీ తెలియని శుంఠలకు నేనేం చెప్పను?" అని లేచిపోయాడా ఉపాధ్యాయుడు.

మరుసటి రోజు కూడా "నేనీ రోజు ఏ విషయం చెప్తానో తెలుసా?" అని అడిగాడు. రాగానే తెలియదంటే నిన్నటిలాగే అవుతుందని విద్యార్థులు, "తెలుసు మాష్టారూ" అన్నారు ముక్తకంఠంతో.

"తెలిస్తే ఇక నేను చెప్పటం ఎందుకు?" అని లేచిపోయాడాయన.

మూడోరోజు రాగానే "ఈ రోజు ఏం చెప్తానో తెలుసా?" అని అదే ప్రశ్న వేశాడు. ఈసారి విద్యార్థులు కొంచెం తెలివిగా "సగం మందికి తెలుసు, సగం మందికి తెలియదు సార్" అన్నారు.

"అయితే తెలిసినవారు తెలియని వారికి చెప్పండి" అని లేచి చక్కా వెళ్ళిపోయాడు ఆ గురువుగారు.

"మీ ఆవిడ నిన్ను ఎందుకు తిడుతోంది."

"ఛీఛీ! తిట్టడం కాదు. ఆవిడ మాట్లాడే తీరే అంత."

సుబ్బయ్యకి ఎపెండిసైటిస్ ఆపరేషన్ విజయవంతంగా జరిగింది. ఆ ఆనందంతో హాస్పటల్ వార్డులోనికి వచ్చి అతగాడు తేలిగ్గా కూర్చున్నాడు. చుట్టుపక్కల రోగులు కుశల ప్రశ్నలు వేసి "ఆపరేషన్ అయిపోనట్టేనా?" అనడిగారు.

"బ్రహ్మాండంగా" అన్నాడు సుబ్బయ్య.

"అంత సంబరపడకండి" అన్నారు మిగతావాళ్ళు.

"ఏం?"

"ఏం లేదు. ఈ డాక్టరుగారు పరమ మతిమరుపు. ఓసారి నాకు ఆపరేషన్ చేసి కడుపులో కత్తెర మరచిపోయాడు. ఇంకో ఆయన కడుపులో సిరంజి మరచిపోయాడు."

"ఛఛ" అంటూ సంబాళించుకుంటున్నాడు సుబ్బయ్య. ఇంతలో డాక్టర్ రానే వచ్చాడు. వస్తూనే సుబ్బయ్యని నిలేసి –

"నాకళ్ళద్దాలు కనిపించటం లేదు మీరేమైనా తీశారా?" అని అడిగాడు.అంతే..సుబ్బయ్యకు స్పృహ తప్పింది మరుక్షణం.

నీటి కొరత ఆ ఊళ్ళో ఎక్కువగా వుండడంతో అక్కడి యువజన సంఘం చెరువు తవ్వించాలనే ప్రణాళిక చేపట్టింది. ఖర్చంతా చందాల రూపేణా సేకరిద్దామని ముందుగా ఓ పిసినారి షావుకారి వద్దకు వెళ్ళింది.

"చెరువు తవ్విస్తున్నాం దానికి మీ సహాయం ఎంతయినా అవసరం. దయతలచి ఏమిస్తారో చెప్పండి."

"డ్రమ్ము నీళ్ళిస్తాను చాలా?"

జానకమ్మ నెలరోజులు పుట్టింటిలో వుండివచ్చింది.

"ఏమండీ నేను ఈ పెట్టెలో నగలు కనబడ్డలేవండీ!" కంగారుగా చెప్పింది భర్త జానకిరావుతో.

"ఫర్లేదు. ఊళ్ళో ఈ మధ్య దొంగల భయమెక్కువయిందని వాటిని సురక్షితమైన చోట దాచానులే" జానకిరావు తాపీగా అన్నాడు.

"అలాగా! ఏ బాంకు లాకర్లో దాచారండీ?"

"లాకరులో కాదు. మార్వాడీ దగ్గర భద్రంగా ఉన్నాయిలే."

ఆదరాబాదరాగా ఓ లావుపాటి ఆడమనిషి డాక్టర్ దగ్గరికి వచ్చింది. వస్తూనే –

"డాక్టర్ నా కళ్ళు, కాళ్ళు పళ్ళు అన్నీ లాగుతున్నాయి మంటగా వుంది పూర్తి అనారోగ్యం. ఏం చేయమంటారు" అనడిగింది.

డాక్టర్ సాలోచనగా "మీ వయస్సు ఎంత?" ప్రశ్నించాడు.

"రేపటికి స్వీట్ సిక్స్‌టీన్ రాబోతోంది."

"మీకు మతిమరుపు కూడా జోడైందన్నమాట" అన్నాడు డాక్టర్ ఆమె వయసును బేరీజు వేసి నవ్వుతూ.

ఓ మతిమరుపు ప్రొఫెసరుగారు ఇంటికొస్తూనే –

"ఏమిటిదంతా? ఇక్కడెందుకీ పుస్తకాలు ఇలా చెల్లాచెదురయ్యాయి? ఆ కోటును ఎవరు కిందపడేశారు? నా బెల్టెక్కడా? చుట్టూ ఈ కాల్చి పారేసిన సిగరెట్లేమిటి? ఈ అల్లరంతా ఎవరు చేశారు" అంటూ భార్యామణిమీద కోపగించుకున్నారు. ఆ భార్యామణి క్లుప్తంగా –

"నా మొగుడు" అంది.

"వాడెవడు? వాడికేం పనిలేదా? ఈమాటు వాణ్ణి రానివ్వకు. వెధవ! వెధవ మొగుడూ నువ్వూను" అన్నాడతను మళ్ళీ.

నౌకరు హడ్రీబడ్రీగా పరుగెత్తుకొచ్చి "అమ్మగారూ! అయ్యగారు ద్వారం దగ్గర స్పృహ తప్పిపడిపోయారు. ఓ చేతిలో పేపరుంది మరో చేతిలో ఏదో పెద్ద పేకెట్ ఉంది" అన్నాడు.

"అయ్య బాబోయ్ అది నా చీర" అంటూ పరుగు తీసింది ఆ ఉత్తమ ఇల్లాలు.

బాగా తాగేసి 'ఫుల్ కిక్'లో వున్న ఓ పత్రికా రచయిత ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను సమీక్షించడానికి వెళ్ళాడు. ఎగ్జిబిషన్ ఎంట్రన్స్ దగ్గర పెద్ద అద్దం వుంది. అందులో తనని తాను చూసుకున్నాడు. తర్వాత ఆఫీసుకువెళ్ళి రాసిన సమీక్ష ఇలా ఉంది.

"ఎగ్జిబిషన్ ఎంతో బాగుంది. ముఖ్యంగా ఎంట్రన్స్ దగ్గర నిలువెత్తు తాగుబోతు పోట్రయిట్ ఉంది. అందులో జీవం వుంది. అయితే బొమ్మ క్రిందుగా చిత్రకారుడి సంతకం లేకపోవడం శోచనీయం పైగా ఆబొమ్మని ఇదివరకెన్నడో ఎవరో వేయగా చూసిన గుర్తు కూడా."

శంకర్రావు ఆ హోటల్లో టిఫిన్ చేసి 'టిప్'గా పావలా వేశాడు. సర్వర్ చాలా ఇబ్బందిగా మొహం పెట్టి "నన్ను మీరు చాలా కించపరుస్తున్నారు. పావలా నా టిప్?" అనడిగాడు.

"మరెంత కావాలట?"

"కనీసం మరో పావలా."

"మళ్ళీ పావలానే ఇచ్చి నిన్ను కించపరచలేను" అంటూ టిప్‌గా వేసిన పావలాకూడా తీసుకుని ఉడాయించాడు శంకరరావు ది గ్రేట్.

COMMENTS